క్లుప్తంగా

29 మందికి కంటి ఆపరేషన్లు



రోగులను ఆపరేషన్‌కు సిద్ధం చేస్తున్న వైద్యుడు

రాయచోటి అర్బన్ : పట్టణ శివార్లలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 29 మంది కంటి రోగులకు వైద్యులు ఆపరేషన్లు నిర్వహించారు. కంటి ఆసుపత్రి ఆవరణలో ఆదివారం ఉదయం ప్రత్యేక వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు. శిబిరానికి రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రాజంపేట, పీలేరు, కదిరి, వాయల్పాడు, తదితర నియోజకవర్గాలకు చెందిన 50 మందికి పైగా రోగులు హాజరయ్యారు. వీరికి కంటి వైద్యులు సురేష్‌బాబు, మహాలక్ష్మిలు వైద్యపరీక్షలను నిర్వహించి, 29 మందికి ఆపరేషన్లు జరిపారు. గత వారం కంటి ఆపరేషన్లు నిర్వహించిన వారికి పరీక్షలు జరిపి కంటి అద్దాలు, మందులను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు స్వరూప్‌గుప్తా, ఆర్.శ్రీనివాసులు రెడ్డి, చెన్నూరు అన్వర్ బాషాతోపాటు పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మాధవరంలో మెగా వైద్య శిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామంలోని శాంతి హెల్త్ కేర్ క్లినిక్‌లో ఆదివారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 93 మందికి ఉచిత వైద్య సేవలను అందించారని శాంతి హెల్త్ కేర్ క్లినిక్ వైద్యుడు డాక్టర్ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపకు చెందిన శ్రీ నారాయణీ కేర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఈ మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. శిబిరంలో కాస్మటాలజీ నిపుణులు డాక్టర్ వి.భార్గవరామ్, స్త్రీ, గర్భిణి, సంతాన సాఫల్య, ల్యాపరోస్కోపిక్ నిపుణులు డాక్టర్ కె.చరిష్మలు శిబిరానికి హాజరైన వారికి ఉచితంగా వైద్య సేవలు అందించి మందులను డిస్కౌంట్ రూపంలో అందించారు.

ఆర్థిక సాయం



బాధితుడితో మాట్లాడుతున్న ట్రస్ట్ సభ్యులు

చిట్వేలి : కెఎస్ అగ్రహారం హరిజనవాడకు చెందిన మోడపోతుల నరసింహులు గత సంవత్సరం నుంచి కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా విశాల్ రెడ్డి, సాయి వికాష్ రెడ్డిలు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. పెంచల్ రెడ్డి, మురళీ, రాజుకుంట సర్పంచ్ నరసింహ, వెంకటేష్, పొన్నారెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆవోపా అధ్యక్షుడిగా వినోద్‌కుమార్



వినోద్‌కుమార్

రాజంపేట టౌన్ : ఆవోపా రాజంపేట యూనిట్ అధ్యక్షుడిగా రాజంపేట పట్టణానికి చెందిన వినోద్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక అమ్మవారిశాలలో ఆదివారం జరిగిన ఆవోపా సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎక్కల రవికాంత్, కోశాధికారిగా సుబ్బారావును ఎంపిక చేశారు. అనంతరం వారిచే ఆవోపా ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ ఆవోపా ఆధ్వర్యంలో విస్తృతంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

రెడ్డెమ్మతల్లీ.. చల్లంగ చూడమ్మా

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగ చూడు తల్లీ అంటూ భక్తులు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు.

27 నుంచి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

మదనపల్లె సిటీ: సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఈనెల 27 నుంచి రాష్ట్ర స్థాయి సీనియర్ బాలుర హాకీ పోటలు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య హాకీ కార్యదర్శి శివప్రసాద్, కోచ్ నౌషాద్ తెలిపారు. ఈ పోటీలకు జిల్లా స్థాయిలో జట్టును ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా జట్టు రాష్ట్ర స్థాయి పాల్గొంటారని తెలిపారు.

రమణీయం.. వేణుగోపాలస్వామి కల్యాణం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరులో వెలసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి రుక్మిణీ, సత్యభామ వేణుగోపాలుని కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గొనేని వారు ఉభయదాతలుగా ఈ కల్యాణ క్రతువుని నిర్వహించారు. ఈ కల్యాణం వేదపండితుల మంత్రోచ్ఛరణలు మధ్య మేళతాళాలు, భక్తుల గోవింద నామస్మరణలు మధ్య కార్యక్రమం జరిపారు. ఈ కల్యాణం తిలకించేందుకు మండలం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నట్లు ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, ఆలయ పూజారి చంద్రశేఖర్ శర్మలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ కుటుంబ సభ్యులు ముత్యాల తలంబ్రాల సమర్పణ

రాజంపేట మాజీ ఎమ్మెల్యేలు కొండూరు ప్రభావతమ్మ, మారారెడ్డిల తనయులు వైఎస్సార్‌సీపీ నియోజవర్గ సీనియర్ నాయకులు కొండూరు అజయ్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ విజయ్‌రెడ్డిలు కల్యాణానికి ప్రతి ఏడాది లాగే ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అలాగే గొనేని వారు పులిహోర, పాయసం వచ్చిన భక్తులకు పంపిణీ చేశారు. వీరితో పాటు పెనగలూరు సీఐ మురళీ మోహన్, విజయ్ భాస్కర్, కె.వెంకటేష్, నరహరి, హరినాథ్ నాయుడులు ప్రత్యేకంగా నాలుగు రకాల ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

వైభవంగా రథోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగంగా వేణుగోపాలస్వామి రథోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. బలిజ సంఘం ఉభయదాతలుగా ఈ రథోత్సవాన్ని నిర్వహించారు. వేకువజాము నుంచే వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారికి పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. రథోత్సవం సందర్భంగా గ్రామంలో విద్యుత్‌ను నిలిపివేసి పురవీధులలో ఊరేగించారు. రథోత్సవంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న వేద పండితులు



స్వామివారికి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కల్యాణానికి హాజరైన భక్తులు

ఘనంగా రథోత్సవం



ప్రత్యేక అలంకారంలో శివపార్వతులు

పుల్లంపేట : పుల్లంపేటలోని శ్రీ పర్వతవర్ధిని శాంతిలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం శివపార్వతుల రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం గ్రామంలో రథోత్సవం జరిపారు.

మొక్కుల చెల్లింపు



పూజలు చేస్తున్న వరలక్ష్మి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని ఈటమాపురం గ్రామం వద్ద పెంచలకొండపై వెలసివున్న లక్ష్మీనరసింహస్వామికి 101 టెంకాయలు కొట్టి ముక్కా వరలక్ష్మి ఆదివారం తమ మొక్కు తీర్చుకున్నారు. అనంతరం తూర్పుపల్లి వద్ద గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పెనగలూరు వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో తూర్పుపల్లి వెంకటయ్య, ఈటమాపురం రాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాకు శ్రీనివాసులు రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్యలతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎల్ విజేత మంటపంపల్లె జట్టు



మంటపంపల్లె జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

నందలూరు : నందలూరు జెడ్పీహెచ్‌ఎస్ క్రీడా మైదానంలో నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్ క్రికెట్ టోర్నీ విజేతగా మంటంపంపల్లెకు చెందిన ముద్దు కృష్ణ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం ఉదయం ముందు బ్యాటింగ్ చేసిన గాంధీనగర్ జట్టు 13 ఓవర్లలో 79 పరుగులకు ఆల్ అవుట్ అయ్యింది. అనంతరం 80 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన మంటపంపల్లె జట్టు 8.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 84 పరుగులు చేసి విజేతగా నిలిచింది. ఆ జట్టు బ్యాట్స్‌మెన్ హనుమంత రెడ్డి 63 పరుగులతో నాటవుట్‌గా నిలిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సొంతం చేసుకున్నాడు. విజేతగా నిలిచిన జట్టుకు రూ. 60,116లు చెన్నయ్యగారిపల్లెకు చెందిన దేవిశెట్టి సుదర్శన్ రాయల్, దేవిశెట్టి వంశీ రాయల్ అందజేశారు. దివంగత వల్లి జ్ఞాపకార్థం వారి కుమారులు సోను, చోటులు రూ.40,116లు రన్నర్స్‌కు అందజేశారు. జనాబ్ ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, మండల కో-ఆప్షన్ సభ్యులు కలీముల్లా ఖాన్ దాదాపు 400 మందికి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ముమ్మడి శెట్టి సుధాకర్, శివకోటి, రంజిత్, పత్తి శంకర, చందు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

కడప రూరల్: ఎన్డీఏ కూటమి ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేపడుతామని హామీ ఇచ్చాయని. ఇచ్చిన మాట ప్రకారం వర్గీకరణను చేపట్టి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ఎన్ రాజా డిమాండ్ చేశారు.

ఆదివారం స్థానిక కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఈదుముడిలో జూలై 7న నిర్వహిస్తున్న మాదిగల జన జాతర సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఏర్పడి 30 ఏళ్ల కాలంలో హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశామన్నారు. తమ భవిష్యత్తు ఎస్సీ వర్గీకరణపై ఆధారపడి ఉందన్నారు. మాదిగల జన జాతర సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగులయ్య, ఉపాధ్యక్షులు కనకరాజు, కార్యదర్శి వెంకటేష్, కడప నగర అధ్యక్షులు శంకర్, ఓబులేసు, గోపయ్య తదితరులు పాల్గొన్నారు

‘గొప్ప దేశభక్తుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జి’



రాజంపేట టౌన్: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాయిలోకేష్

రాజంపేట టౌన్ : భారతదేశ ఐక్యత, పురోగతికి జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి చేసిన సేవలు ఎనలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ తెలిపారు. స్థానిక బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో ఆదివారం శ్యామ్‌ముఖర్జి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలోకేష్ మాట్లాడుతూ కశ్మీర్ కోసం ఆయన అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఒకదేశంలో రెండు జెండాలు, ఇద్దరు ప్రధాన మంత్రులు, రెండు రాజ్యాంగాలు ఉండకూడదని దేశవ్యాప్తంగా ఉద్యమం చేసి కశ్మీర్‌లోనే తన ప్రాణాలను అర్పించిన గొప్ప దేశభక్తుడని కొనియాడారు. కాగా పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి వర్ధంతి వేడుకలను జరిపారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు పిండిబోయిన కృష్ణయాదవ్, సురేష్‌రాజు, పట్టుపోగుల ఆదినారాయణ, షబ్బీర్ అహమ్మద్, జీకే నాగరాజు, సునీత వర్మ, వీవీ.రమణ, వెంకటసుబ్బమ్మ, పత్తిపాటి నవీన్‌కుమార్, మురళీ, డాక్టర్ రేణుప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగికి ఆయుర్వేద మందు తినిపిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : స్థానిక అమ్మవారిశాలలో ఆదివారం ఆవోపా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో వివిధ జబ్బులకు సంబంధించిన రోగులు పాల్గొనగా డాక్టర్ మాలేపాటి వెంకట్రామ్ వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేయడంతోపాటు 750 రూపాయల విలువ చేసే బీఎండీ టెస్ట్‌ను కూడా చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ వెంకట్రామ్ మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని రకాల వ్యాధులకు ఆయుర్వేదంలో మందులు ఉన్నాయన్నారు. ఎలాంటి సైడ్ఎఫెక్ట్ ఉండవని చెప్పారు. అందువల్ల ఆయుర్వేద వైద్యం పొందే వారి సంఖ్య పెరుగుతూ వస్తుందన్నారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 150 మందికి పైగా పాల్గొన్నారు. ప్రధానంగా మోకాళ్లు, కీళ్లనొప్పులు, చర్మవ్యాధి, గ్యాస్ట్రిక్ సమస్యలకు సంబంధించి రోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కామ్రేడ్ తారకనాథ్ సేవలు విలువైనవి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న విరూపాక్ష, సిబ్బంది

రాజంపేట టౌన్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల కోసం కామ్రేడ్ తారకనాథ్ చేసిన సేవలు ఎంతో విలువైనవని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ నాయకులు ఎం.విరూపాక్ష తెలిపారు. స్థానిక ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంక్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ తొలి ప్రధాన కార్యదర్శి దివంగత తారకనాథ్ 20వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ రాజంపేట రీజియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో 51 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విరూపాక్ష మాట్లాడారు. ఎస్‌బీఐ ఉద్యోగుల కోసం కామ్రేడ్ తారకనాథ్ చేసిన గుర్తు చేసుకున్నారు. బ్యాంకు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఆయన చూపిన బాటలో పయనిద్దామని తెలియజేశారు. తారకనాథ్ 32 సంవత్సరాల వయస్సులోనే స్టాఫ్ యూనియన్‌కు ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యి రికార్డు సృష్టించారని తెలిపారు. అలానే రక్తదానం విలువను ఆయన వివరించారు. అనేక మంది రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని, వారికి అవసరమైన రక్త నిల్వలు ఉండటం లేదన్నారు. అందువల్ల తమ యూనియన్ ద్వారా తమవంతు రక్తం అందించేందుకు ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రాజంపేట వంటి చిన్న పట్టణంలో 51 మంది రక్తదానం చేయడం చాలా గొప్ప విషయమన్నారు. రక్తదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. తారకనాథ్ చేసిన సేవలకు గుర్తుగా ప్రతిఏటా ఆయన పేరిట సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ ప్రాంతీయ కార్యదర్శి నజీర్ అహమ్మద్, యూనియన్ ప్రతినిధులు సిరిగిరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గర్నిమిట్ట యల్లమ్మకు విశేష పూజలు



కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మకు విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు మంగళ వాయిద్యాలతో బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ప్రదక్షిణ నిర్వహించి అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

కడప సెవెన్‌రోడ్స్ : క్రమం తప్పకుండా యోగా చేయడం వలన ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్ గోపవరం వెంకట శ్రీనివాసులురెడ్డి అన్నారు. యోగా ద్వారా ఉద్యోగుల్లో పనిచేసే సామర్థ్యం పెరుగుతుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో ఆదివారం సిబ్బందికి ఆయన యోగా తరగతులు ప్రారంభించారు. ప్రతిరోజు రెండు గంటల పాటు యోగా గురువు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే యోగా శిక్షణా కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొనాలని కోరారు. యోగా వలన శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. వేగవంతమైన జీవన యానంలో ప్రతి ఒక్కరూ అనేక ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇందువల్ల బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ఉద్యోగులంతా క్రమం తప్పకుండా యోగా తరగతులకు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా సిద్ధ సమాధి యోగా గురువు భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

• నాగారపమ్మకు బోనాల సమర్పణ



వీరబల్లె : పూజలందుకుంటున్న నాగారపమ్మ

వీరబల్లె : మండలంలోని వీరబల్లి గ్రామ పంచాయతీలోని సుగాలితాండలో కొలువైన నాగరపమ్మకు ఆదివారం తెల్లవారుజామున భక్తులు బోనాలు సమర్పించి జాతర నిర్వహించారు. జాతర సందర్భంగా శనివారం రాత్రి నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతోపాటు మొక్కుబడులు ఉన్న భక్తులు చాందినీ బండ్లు కట్టి గుడి చుట్టూ ప్రదక్షిణలు జరిపారు. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్కభజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి పూజలు నిర్వహించారు.

• ఇరుగులమ్మకు ప్రత్యేక పూజలు



సిద్దవటం: అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారి మూలవిరాట్

సిద్దవటం : మండలంలోని సిద్దవటం గ్రామ శివారులోని మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద పెన్నానది ఒడ్డున వెలసిన ఇరుగులమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన, అర్చనలు వంటి పూజా కార్యక్రమాలను జరిపామన్నారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వచ్చిన భక్తులకు మూలపల్లెకు చెందిన పొట్టేటి క్రిష్ణవేణి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

• నల్లగంగమ్మ ఆలయంలో ..



సంబేపల్లె : దేవరరాయిపై చిన్నారులను పొర్లిస్తున్న భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని మహిమగల పొల్లేరు రాయిపై భక్తులు పొర్లారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

• మల్లూరమ్మకు పూజలు



చిన్నమండెం: భక్తులకు దర్శనమిస్తున్న మల్లూరమ్మ

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యా నదిపై కొలువై ఉన్న మల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు.

• పూజలందుకున్న గంగమ్మ



లక్కిరెడ్డిపల్లె: విశేష అలంకరణలో అనంతపురం గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మకు ఆదివారం వేలాది మంది భక్తులు బోనాలు, తలనీలాలు అర్పించి మొక్కులు చెల్లించారు. ఆదివారం కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూ లైన్‌లో గంటలకొద్ది వేచి ఉన్నారు. లక్కిరెడ్డిపల్లె పోలీసులు భక్తులకు క్యూలైన్లు ద్వారా అమ్మవారి దర్శనాన్ని కల్పించారు. ఆలయ ప్రత్యేక అధికారి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పర్యవేక్షణ చేపట్టారు. ఆలయ పూజారులైన చెల్లు వంశీయులు గంగాధర్, రవిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.